# సాక్షి నంద్యాల

శనివారం। 23। నవంబర్। 2024






## భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు.



## అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కొమ్ము సూర్య సోమయాజి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | :1,633 |
| ప్రస్తుతం | :1,630.52 |
| సామర్థ్యం (టీఎంసీలు) | :105.788 |
| ప్రస్తుతం | :96 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :3,223 |
| అవుట్ ఫ్లో | :6,461 |

## న్యూస్‌రీల్

### 29న మహానందిలో లక్ష బిల్వార్చన



మాట్లాడుతున్న ఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: కార్తీకమాసం ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 29న మహానందిలో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం దేవస్థానం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 29న మహానందీశ్వర స్వామికి లక్ష బిల్వార్చన, 30న కామేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన పూజలు చేపడతామన్నారు. అదే రోజు సాయంత్రం మహానందీశ్వరస్వామి దంపతులకు శాంతి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్ధనశర్మ, మూలస్థానం శివశంకరశర్మ పాల్గొన్నారు.

### మెరుగైన సేవలందించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఓ

బేతంచెర్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఓ జఫ్రుల్లా వైద్య సిబ్బందినికి సూచించారు. శుక్రవారం శేషారెడ్డి సీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇప్పటి వరకు నార్మల్, సిజేరియన్ ఆపరేషన్లు ఎన్ని నిర్వహించారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందుల కొరత లేకుండా చూసుకోవాలని, బయటకు రాసి ఇవ్వవద్దని సూచించారు. అత్యవసర కేసులను ప్రథమ చికిత్స అనంతరం ఆలస్యం చేయకుండా డోన్, నంద్యాల, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సాగరిక, చరణ్‌రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

కర్నూలు (అర్బన్): ఈనెల 25వ తేదీన నిర్వహించాల్సిన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో జెడ్పీ సమావేశాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయాల్లో జిల్లాపరిషత్ సమావేశాన్ని నిర్వహించకూడదనే నిబంధన మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

### నృత్య నీరాజనం



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్నకు శుక్రవారం నృత్యనీరాజనం పలికారు. క్షేత్ర పరిధిలోని నిత్యకళారాధన వద్ద సికింద్రాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మీ గణపతి కల్చరర్ ఆర్గనైజేషన్ వారి సంప్రదాయ నత్యప్రదర్శన భక్తులను అలరించింది. అంతకుముందు తిరుచానూరు ఎన్. పూర్ణిమ బృందం సంగీత విభావరి కూడా ఆకట్టుకుంది.

# దర్జాగా కబ్జా!



**భూ కబ్జాలకు** అడ్డూ అదుపులేకుండా పోతోంది. కొందరు అధికార పార్టీ అండతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అది ప్రభుత్వానిదా..ప్రైవేటుదా చూడకుండా ఆక్రమించుకుంటున్నారు. కాలువలు, కుంటలు, చెరువులు, సెలయేర్లను సైతం వదలడం లేదు. ప్రస్తుతం ఆళ్లగడ్డ పట్టణంలో బ్రిటీష్ కాలం నుంచి ఎంతో ప్రసిద్ధి చెందిన కేసీ కాల్వలు కబ్జాలకు గురై నామరూపాలు లేకుండా పోయాయి. ఫలితంగా దిగువకు సాగు నీరు రాక వేలాది ఎకరాలు బీడు భూములుగా మారుతున్నాయి. ఈ అక్రమాలను కట్టడి చేయాల్సిన పాలకులు, కేసీ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు తమ వాటా తాము తీసుకుంటూ తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

- ఆళ్లగడ్డలో అడ్డూఅదుపూ లేని ఆక్రమణలు
- తమ్ముళ్ల దెబ్బకు రూ.300 కోట్లు విలువ చేసే కేసీ కాలువలు మాయం
- వాటిపై అక్రమ లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకుంటున్న వైనం
- కేసీ కాలువల ఆక్రమణతో 1,500 ఎకరాలకు నిలిచిన సాగునీటి పారుదల
- పట్టించుకోని కేసీ కెనాల్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

ఆళ్లగడ్డ: ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల్లో ప్రధాన సాగునీటి వనరైన కేసీ కాల్వ ఆళ్లగడ్డ పట్టణంతో పాటు చుట్టు పక్కల ఉన్న అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. మొన్నటి దాక కాల్వ పొడువున విలువైన భూములు, గట్లు, దారులను ఇష్టానుసరం కబ్జా చేసిన అక్రమార్కులు తాజాగా కాలువలను సైతం పూడ్చి వేసి వాటిపైనే నిర్మాణాలు చేపడుతూ.. లే అవుట్లు వేసి క్రయ,విక్రయాలు జరుపుతూ రూ కోట్లు గడిస్తున్నారు. ఇదంతా కళ్లెదుటే జరుగుతున్నా అధికారులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. కొన్ని చోట్ల అధికారులే అనధికారికంగా ఎన్‌ఓసీలు ఇచ్చి.. అక్రమ నిర్మాణాలకు పన్ను రసీదులు ఇస్తూ.. స్థలాలను రిజిస్టర్ చేసుకుని క్రమబద్ధీకరణ చేసుకునేలా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కాలువలు మాయం.. ఆక్రమణల మయం..**

కర్నూలు నుంచి కడపకు వెళ్తున్న కేసీ ప్రధాన కాలువ చింతకుంట, లింగందిన్నె కాల్వల గుండా ఆళ్లగడ్డ మున్సిపాలిటీ మధ్య నుంచి అవతల వైపు ఉన్న పట్టణ పొలాలతో పాటు పాలసాగరం, కందుకూరు పొలాలకు వెళ్లేందుకు బ్రిటీష్ ప్రభుత్వంలో మొత్తం ఐదు ప్రధాన పంట కాల్వలను ఏర్పాటు చేశారు. ఈ కాల్వల కింద 830 మంది రైతులకు చెందిన సుమారు 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అడ్డుగా ఉన్నాయని ఒక్కొక్కరు కాలువలను కబ్జా చేయటంతో నేడు అవి ఉనికిని కోల్పోయాయి. ఫలితంగా దిగువ ప్రాంతంలోని ఆయకట్టు రైతులు సాగునీరు రాక ఇబ్బందులు పడుతుండగా ఎగువ ప్రాంతంలో నివాసాలు ఉన్న ప్రజలు వర్షాకాలంలో వర్షపు నీరు కాలనీల్లో నుంచి బయటకు వెళ్లేందుకు దారి లేక ఇళ్లలోకి వస్తుండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణ శివారులో అధికార పార్టీకి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏకంగా డిస్ట్రిబ్యూటరీనే మూసివేసి మొత్తం కాలువను, ఇరువైపులా ఉన్న కాలువ స్థలాన్ని ఆక్రమించుకుని విక్రయించాడు. సంబంధిత అధికారులకు ఈ ఆక్రమణ విషయం తెలిసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గూబగుండం కేసీ ప్రధాన కాలువ దుస్థితి



ఇది పట్టణంలోని నంద్యాల రోడ్డులో కోవెలకుంట్ల రోడ్డు నుంచి వక్కిలేరుకు పోయే కేసీ కాలుపైన నిర్మించిన బహుళ అంతస్తుల భవనం. సుమారు 300 ఎకరాలకు పైగా సాగునీరు, మూడు గ్రామాలకు తాగు, వాడుక నీరు అందించే ఈ కాలువను నిట్ట నిలువన పూడ్చి వేసి దానిపై ఈ భవనం కట్టాడు. అనధికారికంగా నిర్మాణం చేపట్టినప్పటికీ మున్సిపల్ అధికారులు ఇంటిపన్ను తీసుకుని రసీదు ఇస్తున్నట్లు సమాచారం. ఈ రసీదుతో కేసీ కాలువ స్థలాన్ని క్రమబద్ధీకరణ చేసుకుని విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసుకుని ఇళ్లను బాడుగకు ఇవ్వడం గమనార్హం.

**కబ్జా స్థలం విలువ రూ 300 కోట్లకు పైనే..?**

పట్టణ పరిధిలోని 6 కేసీ పంట కాలువలను చదును చేసి అనధికారికంగా లేఅవుట్లు వేసి ఆ ప్లాట్లను విక్రయిస్తూ అధికార పార్టీకి చెందిన రియల్టర్లు రూ.కోట్లు దోచుకుంటున్నారు. దాదాపు అన్ని ప్రాంతాల్లో సెంటు కీసం రూ. 10 లక్షలకు పైగానే ఉంది. కబ్జాకు గురై అన్యాక్రాంతమైన 6 పంట కాల్వల విస్తీర్ణం సుమారు 30 ఎకరాలు ఉంటుందని అంచనా. ఈ లెక్కన సెంటు రూ. 10 లక్షలకు విక్రయించినా 30 ఎకరాలకు రూ. 300 కోట్లకు పైగా అక్రమార్కుల సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. అయితే, ఇందులో సంబంధిత అధికారులకు ఎంత ముట్టిందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ చుట్టుపక్కల ప్రాంతాల్లో సర్వే చేయించి కేసీ కాలువల స్థలాల పరిరక్షణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**కర్త, కర్మ, క్రియ అంతా'సర్వే'శ్వరుడేనా..?**

వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కేసీ కాల్వలు అన్యాక్రాంతమైపోవడానికి ప్రధానంగా రెవెన్యూ కార్యాలయంలో దశాబ్దకాలంగా తిష్టవేసిన అధికారే కారణమని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలో ఎక్కడ ఆయకట్టు కాల్వలు ఉన్నాయి, వాటికి సంబంధించిన స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్న వాటిపై మంచి పట్టు ఉన్న ఈ అధికారి పట్టణంలోని ప్రధాన రోడ్డులో రూ. కోట్లు విలువైన కేసీ కాలువ స్థలాన్ని ఆక్రమించుకుని కాంప్లెక్స్ కట్టారు. ఇతను ఆక్రమించుకోవడంతో పాటు ఓ వీఆర్వోను లోబరుచుకుని అధికార పార్టీ నేతలకు ఎక్కడెక్కడ కాల్వలు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిని ఎలా అన్యాక్రాంతం చేయాలన్న వాటిపై తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. సదరు అధికారితో వివిధ రూపాల్లో లాభం చేకూరుతుండటంతో ఆయనపై వందల కొద్ది ఆరోపణలొచ్చినా బదిలీ లేకుండా ఇక్కడే 12 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇక్కడ ప్లాట్లుగా విభజించి అంతర్గత రోడ్లు వేసిన ఈ అనధికారిక లేఅవుట్ మున్సిపల్ వైస్ చైర్మన్‌ది. పట్టణ శివారులోని లింగందిన్నె రోడ్డు నుంచి పాలసాగరం వరకు సుమారు 6 కి.మీ సాగు నీరు అందించే కేసీ పంట కాలువతో పాటు దాని పక్కన ఉన్న బండ్ల బాటను కబ్జా చేశాడు. తర్వాత ఈ రెండింటిని చదును చేసి ప్లాట్లు వేసి రూ. 4 కోట్లకు పైగా సొమ్ముచేసుకున్నాడు. పంట కాలువ కబ్జాతో ప్రస్తుతం సుమారు 500 ఎకరాలకు సాగునీరు పూర్తిగా నిలిచిపోయినా ఆక్రమించుకున్న వ్యక్తి అధికార పార్టీలో ఉన్నందుకు అధికారులు పట్టించుకోవడం లేదు.

### పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి



మా ఊరుకి ఆళ్లగడ్డ టౌన్ నుంచి మూడు పంట కాల్వల గుండా కేసీ కెనాల్ నీళ్లు వచ్చేవి. వరిమళ్లు కోసుకుందామన్నా బురద ఆరేది కాదు. అటువంటిది ఇప్పుడు కాల్వల్లో చుక్క నీరు రావడంలేదు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేదు. టౌన్‌లో ప్లాట్ల వ్యాపారం చేసేవాళ్లు మొత్తం కాల్వలను ఆక్రమించుకున్నారని చెబుతున్నారు. అధికారులు స్పందించి మా ఊరుకు సాగునీరు అందించాలి

– మర్రెడ్డి రాజారెడ్డి, రైతు, పాలసాగరం

### చర్యలు చేపడుతాం



కొత్తగా బాధ్యతలు చేపట్టడం జరిగింది. కాలువలు ఆక్రమణకు గురైనట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఏది ఏమైనా విచారించి ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురయ్యాయో సంబంధిత అధికారులతో చర్చించి సర్వే చేస్తాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం.

– వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆళ్లగడ్డ

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈఓ జనార్దన్‌రెడ్డి



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

గడివేముల: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎస్‌ఏ పరీక్షలు 1, 2 లలోఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ బీఎస్ రామ్మోహన్‌రెడ్డిని డీఈఓ సన్మానించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో కేసీ కెనాల్ నీరు నిల్వ ఉండటాన్ని గమనించి.. రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్‌ను కోరారు. డీఈఓ వెంట ఉర్దూ డీఐ హస్మద్దీన్, ఎంఈఓ విమలావసుంధర దేవి, హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ శ్రీనివాసులు ఉన్నారు.

# పనితీరు మెరుగుపరుచుకోండి

- ఏపీఈఆర్‌సీ చైర్మన్ రామసింగ్ ఠాగూర్



మాట్లాడుతున్న ఏపీఈఆర్‌సీ చైర్మన్ రామసింగ్

కర్నూలు న్యూసిటీ: పనితీరు మెరుగుపరుచుకోవాలని ఏపీఈఆర్‌సీ చైర్మన్ రామసింగ్ ఠాగూర్ సూచించారు. శుక్రవారం నగర శివారులోని ఏపీఈఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన వర్క్ షాపులో రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల చీఫ్ జనరల్ మేనేజర్లు, జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో తాజాగా నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. కమిషన్ నిర్ధారించే ట్రూ ఆప్ చార్జీలు, ఇంధన, విద్యుత్ కొనుగోళ్లు, సర్దుబాటు చార్జీల గురించి తెలుసుకోవాలన్నారు.

## భక్తులకు ఉచిత బస్సు సదుపాయం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఈఈ

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం శుక్రవారం సాయంత్రం ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభించింది. వారాంతపు సెలవు రోజులతోపాటు పర్వదినాల్లో అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలివస్తున్న నేపథ్యంలో ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. వారాంతపు రోజుల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 నుంచి సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు గణేశ సదన్ నుంచి అన్నప్రసాద భవనం మీదుగా క్యూకాంప్లెక్స్ వరకు భక్తులు ఈ ఉచిత బస్సును వినియోగించుకోవచ్చు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎం.నరసింహారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఐ/సి) పి.చంద్రశేఖరశర్మ పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించండి



పెద్దకంబలూరు ఆయిల్‌పాం నర్సరీ వద్ద మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

రుద్రవరం: ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియ రైతులకు సూచించారు. మండల పరిధిలోని పెద్దకంబలూరు మెట్ట వద్ద రైతు ఏర్పాటు చేసిన ఆయిల్ పాం నర్సరీని శుక్రవారం ఆమె పరిశీలించారు. నర్సరీలో ఏపుగా పెరుగుతున్న ఆయిల్ పాం మొక్కలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 5 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా కేవలం లక్ష ఎకరాల్లో మాత్రమే ఉద్యాన పంటలు సాగవుతున్నాయన్నారు. ఉద్యాన పంటల సాగుకు ముందుకు వచ్చే రైతులకు రాయితీతో మొక్కలు అందజేసి, మెయింటెనెన్స్ ఖర్చులు అందజేస్తామన్నారు. మండలంలో ఈ ఏడాది 400 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయించాలనే లక్ష్యాని చేరుకున్నామన్నారు. వచ్చే ఏడాది వెయ్యి ఎకరాల్లో సాగు లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. ఇక్కడి భూములు సారవంతమైనవని ఎంత పెద్ద తుపాన్లు వచ్చినా ఉద్యాన పంటలకు ఎలాంటి నష్టం ఉండదని, ఆయిల్‌పాం సాగుచేయడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చని వివరించారు. అనంతరం రుద్రవరం–అప్పనపల్లె దారిలో ఉపాధిహామీ పథకం కింద రైతులు సాగు చేసిన మామిడి తోటలను, రుద్రవరం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ జనార్దన్‌రావు, ఏపీడీ నాగరాజు తహసీల్దారు, మల్లికార్జునరావు, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, ఏఓ నాగేంద్ర ప్రసాదు ఉన్నారు.

**టాయిలెట్లు, పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేయండి**

నంద్యాల: పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లోని టాయిలెట్లు, తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్‌పీసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, సీడీపీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా మొదలుపెట్టని పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పురోగతిలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్, బేటీ పడావో బేటీ బచావో, 100 శాతం పోషణ్ అభియాన్ కిట్లు, పిల్లల హాజరు నమోదు, గ్రోత్ మానిటరింగ్, ఎఫ్‌ఆర్‌ఎస్, బాలామృతం, పాలు, గుడ్లు తదితర వాటిలోల లోపాలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి పాల్గొన్నారు.

# బడి 'గంట' బరువాయె!

- ఉన్నత పాఠశాలల పని వేళలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- అనాలోచిత నిర్ణయంతో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకం
- పని వేళల పెంపు నిర్ణయం సరికాదంటున్న ఉపాధ్యాయ సంఘాలు

**కొత్తగా వచ్చిన** కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. ఇప్పటికే బోధనా సిబ్బందికి చట్టబద్ధంగా సంక్రమించిన క్యాజువల్ లీవ్ మంజూరులో నిబంధనలు పెట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు పాఠశాలల సమయాన్ని మరో గంట పెంచుతూ ఇటు విద్యార్థుల అభద్రతాభావానికి .. అటు ఉపాధ్యాయుల మానసిక వేదనకు కారణమవుతోంది. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు నెత్తీనోరు కొట్టుకుంటున్నా పట్టించుకోకుండా ఉమ్మడి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన 573 పాఠశాలల్లో ఈనెల 25 నుంచి అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.

నంద్యాల(న్యూటౌన్)/ఆదోని సెంట్రల్: ఉమ్మడి జిల్లాలో 573 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటి పని వేళలు ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగేలా నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద నంద్యాల జిల్లాలో 23, కర్నూలు జిల్లాలో 26 కలిపి మొత్తం 49 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో ఈ నెల 25 నుంచి ఈ విధానాన్ని అమలు చేసేందుకు విద్యా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్కూళ్లలోనూ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**ఒంటెద్దు పోకడ..**

పని వేళలు పెంచడం, తగ్గించడం చేస్తే ఆ ప్రభావం ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై కూడా పడుతుంది. వారి అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నా.. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలా వ్యవహరిస్తోంది. అనుకున్నదే తడవుగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీని వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడతారనే విషయాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

**విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకం**

పాఠశాలల పనివేళలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పల్లెల నుంచి మండల, నియోజకవర్గ కేంద్రాల్లోని పాఠశాలలకు రాకపోకలు సాగించే విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యాలు లేవు. ఇప్పుడే ప్రైవేట్ వాహనాలను పట్టుకుని ఎలాగోలా చీకటి పడేలోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. 10వ తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ పేరుతో ఇప్పటికే గంట అదనంగా సమయం వెచ్చిస్తున్నారు. 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు మరో గంట పెంచితే స్టడీ అవర్స్‌కు ఇబ్బందిగా మారుతుంది. అయినా ఆ సమయంలో తాము ఇళ్లకు చేరుకోవడం కష్టమైపోతుందని విద్యార్థులు వాపోతుండగా.. తమ పిల్లలను బడి మాన్పించాల్సి వస్తుందేమోనని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆదోని పట్టణంలోని పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

**మారనున్న టైం టేబుల్ ఇదే..**

| | |
|---|---|
| ఫస్ట్ బెల్ | 9గంటలకు |
| సెకండ్ బెల్ | 9.05 |
| స్కూల్ అసెంబ్లీ | 9.05 - 9.25 |
| మొదటి పీరియడ్ | 9.25 - 10.15 |
| రెండవ పీరియడ్ | 10.15 - 11.00 |
| బ్రేక్ | 11.00 - 11.15 |
| మూడవ పీరియడ్ | 11.15 - 12.00 |
| నాల్గవ పీరియడ్ | 12.00 - 12.45 |
| లంచ్ బ్రేక్ | 12.45 - 1.45 |
| ఐదవ పీరియడ్ | 1.45 - 2.30 |
| ఆరవ పీరియడ్ | 2.30 - 3.15 |
| బ్రేక్ | 3.15 - 3.30 |
| ఏడవ పీరియడ్ | 3.30 - 4.15 |
| 8వ పీరియడ్ | 4.15 - 5.00 |

### పిల్లలు అలసిపోతారు



ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అశాస్త్రీయమైనది. విద్యాభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా ఉంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంటే విద్యార్థులు అలసిపోతారు. తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– సి.నాగరాజు ఎస్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు

### ఆలోచన విరమించుకోవాలి



ఉన్నత పాఠశాలల పని వేళలు పెంచాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలి. గతంలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4:40 వరకు హైస్కూల్ పాఠశాలల పని వేళలు ఉండేవి. సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు మార్పు చేసింది. సాయంత్రం 5 గంటలకు పాఠశాల వదిలితే గ్రామాలకు వెళ్లాల్సిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు. విద్యార్థినులకూ భద్రత ఉండదు.

– నగరి శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, నంద్యాల

# మేలుజాతి జీవాల ఉత్పత్తికి గ్రహణం

- మేకలు, గొర్రెల వీర్యోత్పత్తిపై నీలినీడలు
- రూ.6.74 కోట్లతో జీవాల వీర్యోత్పత్తి కేంద్రం
- మొదట ఆరు రకాల మేకపోతుల ఉత్పత్తికి ప్రణాళికలు
- శాస్త్రవేత్తలు, సిబ్బంది నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం చోద్యం
- వచ్చే ఏడాదంటూ దాటవేత



ప్రాంతీయ మేకపోతు వీర్యోత్పత్తి కేంద్రం


మేత మేస్తున్న జీవాలు

ఎమ్మిగనూరు: మేలుజాతి మేకలు–గొర్రెల వీర్యోత్పత్తి కేంద్రానికి ముందరి కాళ్ల బంధం ముడిపడింది. అక్టోబర్ నుంచి ప్రారంభం కావాల్సిన వీర్యోత్పత్తి కేంద్రంపై నీలినీడలు కమ్ముకొన్నాయి. కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం, శాస్త్రవేత్తల నియామకాలు చేపట్టకపోవటంతో ఉత్పత్తి కేంద్రం ప్రారంభం ప్రకటనలకే పరిమితమైంది. వచ్చే ఏడాదిలో మేకపోతు వీర్య కేంద్రం ఉత్పత్తులు మొదలవుతాయని అధికారులు చావుకబురు చల్లగా చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను సుస్పష్టం చేశారు.

**ప్రాజెక్టు ప్రస్థావన**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం పశ్చిమప్రాంతమే. వర్షాభావం..పేదరికంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే కూలీలు ఏటేటా పెరుగుతూనే ఉన్నారు. పథకాలెన్నో ప్రవేశపెట్టిన ఇక్కడి వలస బతుకుల్లో మార్పుల్లేవు. తుంగభద్ర దిగువ కాలువ కొంతమేర ప్రధాన సాగునీటి వనరు. ఎక్కువ శాతం వర్షాధారమే జీవనాధారమైంది. వెక్కిరిస్తున్న వేదవతి ప్రాజెక్టు ప్రతిపాదనలు, ఆర్భాటలకే పరిమితమైన ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణాలు పాలకుల వైఫల్యాలను ప్రతిబింబిస్తున్నాయే తప్పా రైతుల కష్టాలకు అక్కరకు రావటం లేదు. వ్యవసాయంతోపాటు మేకలు, గొర్రెల పెంపకం, పాడి పశువులతో ఇక్కడివారు జీవనోపాధులకు బాటలు వేసుకొంటున్నారు. అందులో భాగంగా బనవాసిలో మేలుజాతి మేకలు, గొర్రెల ఉత్పత్తికి బీజం పడింది. కరువు రైతుకు అదనపు ఆర్థిక పటిష్టతకు మార్గం ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మేలుజాతి గొర్రెల పెంపకానికి పొట్టేళ్ల వీర్యోత్పత్తి కేంద్రం నిర్మాణ పనులు చేపట్టారు. విత్తన మేకపోతులు–పొట్టేళ్ల కోసం నూతన షెడ్లను నిర్మించారు. అయితే కొత్తగా ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వీర్యోత్పత్తి కేంద్రానికి శాస్త్రవేత్తల నియామకం చేపట్టాల్సి ఉంది. ప్రధాన శాస్త్రవేత్తతోపాటు ముగ్గురు శాస్త్రవేత్తలు, ఆఫీసు సిబ్బందిని నియమించాలి. అప్పుడే మహోన్నత లక్ష్యం ఉత్త మ ఫలాలను అందించగలదు. కానీ కూటమి ప్రభు త్వం అలసత్వంతో నేటికీ ఎటువంటి పురోగతి లేదు.

**జిల్లాలో 20 లక్షలకుపైగా జీవాల పెంపకం**

వర్షాభావ పరిస్థితులు, వాతావరణం అనుకూలించక జిల్లాలోని సన్న, చిన్నకారు రైతులు వ్యవ సాయంతో పాటు పశుపోషణను జీవనోపాధిగా ఎంచుకున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పశువులతో పాటు గొర్రెల, మేకల పెంపకాన్ని వ్యాపార దృక్పథంతో చేపట్టారు. జిల్లాలో గొర్రెలు, మేకలు 20 లక్షలకు పైగా ఉన్నాయి. ఒకే ఈత (ప్రసవం)లో ఎక్కువ పిల్లలను ఈనే విధంగా సాంకేతికతను జోడించి రైతులకు ఆదాయ మార్గాలను పెంచాలనే ఉద్దేశంతోనే గొర్రెలు, మేకల వీర్యోత్పత్తి కేంద్రాన్ని చేపడుతున్నారు.

**మేలుజాతికి బనవాసి**

మేలు జాతి పశుసంతతి ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా బనవాసి బాసిల్లుతోంది. బనవాసి ఫారంలోని ఘనీకృత పశు వీర్య కేంద్రం దేశంలోనే పేరు గాంచింది. రాష్ట్రంలో మూడు కేంద్రాలుంటే అందులో రెండు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే (ఎమ్మిగనూరు, నంద్యాల) ఉండటం విశేషం. ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఘనీకృత వీర్య ఆంబోతు కేంద్రం నిర్వహించబడుతుంది. బనవాసిలో 1985–86 సంవత్సరంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మరో రెండు భారీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం బనవాసినే ఎంచుకొంది. గొర్రెలు–మేకల పరిశోధన కేంద్రం, యంగ్ బుల్ (ఒంగోలు జాతి ఎద్దులు) పెంపక కేంద్రం ముందుకొచ్చింది. ముందుగా పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసింది. పశు ఘనీకృత కేంద్రం ప్రాంతంలో మేలు జాతి మేకలు, గొర్రెల ఉత్పత్తి కోసం చర్యలు చేపట్టారు. రూ.6.74 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. రూ.75 లక్షల వ్యయంతో గొర్రెలు, మేకల వీర్యోత్పత్తి కేంద్రాన్ని నిర్మించారు. రూ.72 లక్షల వ్యయంతో 2 షెడ్లు, ఒక కలెక్షన్ యార్డు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరికరాలు, యంత్రసామగ్రి కోసం రూ.1.04 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవటంతో పశ్చిమ రైతులు నిరాశ చెందుతున్నారు.

### వచ్చే ఏడాది నుంచి మేకపోతుల ఉత్పత్తి



బనవాసి మేకలు –గొర్రెల ఘనీకృత కేంద్రం అక్టోబర్ నుంచి వీర్యోత్పత్తి చేపట్టాల్సి ఉండంగా పనులన్నీ అసంతృప్తిగా ఉన్నాయి. దీంతో వచ్చే యేడాది ఫిబ్రవరి నుంచి వీర్యోత్పత్తి చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ఇక్కడ మేలుజాతి మేకపోతుల వర్గంలో జమునాపరి, పర్బరీ, బీటల్, ఉస్మానాబాద్, మల్బరీ, షిరోహి వంటి ఆరు మేకపోతు రకాల వీర్యోత్పత్తి చేపట్టేలా చూస్తున్నాం. బోర్, జక్రాన్, సూర్తి రకాలు ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా ఉండవు. ప్రభుత్వం కొత్తగా నియామకాలు చేపట్టేవరకూ ప్రస్తుతం ఘనీకృత ఆబోతు వీర్యోత్పత్తి కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బందితోనే ఈ కేంద్రాన్ని ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం అదనంగా శాస్త్రవేత్తలను, సిబ్బందిని నియమిస్తే ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చు.

– డాక్టర్ జి.చంద్రశేఖర్‌రావు, డీడీ

## క్లుప్తంగా

### అదృశ్యమైన విద్యార్థి మహానందిలో ప్రత్యక్షం


విద్యార్థి అఖిల్‌ను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

బేతంచెర్ల: పట్టణంలో అదృశ్యమైన బాలుడు మహానందిలో ప్రత్యక్షమయ్యాడు. వివరాలు.. స్థానిక సంజీవనగర్ కాలనీకి చెందిన ఏడవ తరగతి విద్యార్థి అఖిల్ ఈనెల 20 తేదీన అదృశ్యమైన విషయం విదితమే. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది విద్యార్థి కోసం గాలింపు చేపట్టారు. బేతంచెర్ల పట్టణంలో సీసీ పుటేజీ దృశ్యాలను పరిశీలించగా అఖిల్ రైలు ఎక్కి నంద్యాల వైపు వెళ్లినట్లు గుర్తించారు. దీంతో నంద్యాల, మహానంది ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. మహానందిలో విద్యార్థి అఖిల్ ఆచూకీ లభించడంతో శుక్రవారం తల్లికి అప్పగించారు.

### ఆట్యా-పాట్యా విజేత ఓర్వకల్లు


విజేతలకు ట్రోఫీ, షీల్డ్, మెడల్స్ బహూకరించిన ప్రిన్సిపాల్ సుందర్రాజు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఆట్యా–పాట్యా టోర్నమెంట్ కమ్ సెలెక్షన్ పోటీలు ముగిశాయి. బాలికల విభాగంలో ఓర్వకల్ కేజీబీవీ పాఠశాల (ప్రథమస్థానం), మంత్రాలయం కేజీబీవీ పాఠశాల (ద్వితీయ స్థానం), పంచలింగాల కేజీబీవీ పాఠశాల (తృతీయ స్థానం)లో నిలిచాయి. బాలుర విభాగంలో ఓర్వకల్ ఏపీ మోడల్ స్కూల్ (ప్రథమస్థానం), ఆహోబిలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ద్వితీయ స్థానం), ఆళ్లగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తృతీయ స్థానం)లో నిలిచాయి. విజేతలకు సాయి క్రిష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందర్రాజు ట్రోఫీ, వ్యక్తిగత బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడా సంఘాల ప్రతినిధులు నాగరత్నమయ్య, విజయ్‌కుమార్, వినోద్, చరణ్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### గ్యాస్ లీకేజీతో గుడిసె దగ్ధం


దగ్ధమైన గుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్

బండిఆత్మకూరు: మండలంలోని జీసీపాలెం గ్రామంలో వంటగ్యాస్ లీకేజీతో ఆకుమల్ల బాలాంజనేయులుకు చెందిన గుడిసె దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బాలాంజనేయులు భార్య సమీర శుక్రవారం ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. మంటలు గడిసెకు వ్యాపించడంతో సమీర బయటకు పరుగులు తీసింది. గుడిసెలో ఉన్న తిండి గింజలతో పాటు ఆరుగాలం కష్టించి కూడబెట్టుకున్న డబ్బులు, బంగారు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. మండల తహసీల్దార్ థోనీఆల్‌ఫ్రెడ్‌కు సమాచారం అందించగా ఆయన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# పెళ్లి చేయలేదని తండ్రిని చావబాదారు

- కంట్లో కారం చల్లి, కాళ్లు విరగ్గొట్టిన కుమారులు
- అడ్డుకోని భార్య, కుమార్తె


తీవ్రంగా గాయపడిన మంతరాజు

గోనెగండ్ల: 'మాకు పెళ్లి చేసుకునే వయసొచ్చింది.. ఎప్పుడు పెళ్లి చేస్తావు? ఆస్తులెప్పుడు పంచుతావు?' అంటూ కన్న తండ్రి అనే కనికరం లేకుండా కుమారులు పాశవికంగా దాడి చేశారు. వివరాలు.. గోనెగండ్లకు చెందిన మంత రాజుకు భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు నీలకంఠ, జగదీష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుమారులిద్దరూ ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ సమీపంలో కిరాణం షాప్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెకు పెళ్లి కావాల్సి ఉంది. గత కొంతకాలంగా కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు ఉన్నాయి. ఈ స్థితిలో శుక్రవారం ఇద్దరు కుమారులు.. తమకు పెళ్లిళ్లు ఎప్పుడు చేస్తావని, ఆస్తి ఎప్పుడు పంచుతావని తండ్రితో గొడవపడ్డారు. తర్వాత ఇంటి తలుపులు మూసి తండ్రి కంట్లోకి కారం చల్లి కట్టెలతో చితకబాది కాళ్లు విరగ్గొట్టారు. అడ్డుకోవాల్సిన భార్య, కూతురు కూడా వారికి వత్తాసు పలికారు. తీవ్రంగా గాయపడిన మంతరాజు కేకలు వేయడంతో స్థానికులు దాడిని అడ్డుకున్నారు. అనంతరం ఆటోలో స్థానిక ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన ఇద్దరు కుమారులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు మంత రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ గంగాధర్ తెలిపారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ


గ్రామస్తులను విచారణ చేస్తున్న ఏపీడీ అన్వరాబేగం

కొత్తపల్లి: ఉపాధి పనుల కల్పనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులకు హార్టికల్చర్ సబ్సిడీలు కల్పించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముసలిమడుగు ఫీల్డ్ అసిస్టెంట్ దాసుపై శుక్రవారం ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం, ఏపీఓ హరికృష్ణ, సర్పంచు జమిలాబీతో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023–2024 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అనుబంధ శాఖల పనులపై గత జూలై 23వ తేదీన 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగింది. అందులో.. ముసలిమడుగు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ దాసు కొంతమందికి మాత్రమే ఉపాధి పని కల్పించడం, ఉద్యోగులకు హార్టికల్చర్ సబ్సిడీలు కల్పించడం వంటి విషయాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో పాటు 65 మంది రైతులు హార్టికల్చర్ సబ్సిడీలతో సాగుచేసిన మొక్కలు తగిన ఎత్తు లేకుండా చిన్నగా ఉన్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది తేలడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని, వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# దాత తీరుపై పండితుల ఆవేదన


మాట్లాడుతున్న ఈఓ, పండితులు, అర్చకులు

మహానంది: మహానంది దేవస్థానం అన్నప్రసాద పథకానికి కూరగాయలు అందించే దాత టి.ప్రసాద్ తీరుపై ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేద పండితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కార్తీక మాసం, పౌర్ణమి రోజున నిర్వహించిన కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలకు టి.ప్రసాద్ హాజరై తనకు మర్యాదలు చేయలేదంటూ దుర్భాషలాడుతూ వేద పండితులు హనుమంతుశర్మపై చెయ్యి చేసుకున్నారని వాపోయారు. ఆలయంలో అన్నప్రసాద పథకానికి కొన్నేళ్ల నుంచి కూరగాయలు అందిస్తున్నారన్న కారణం, ఆలయ ప్రతిష్టకు భంగం కలగరాదనే ఉద్దేశంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఆయనే దుర్భాషలాడి చెయ్యి చేసుకుని, కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం బాధాకరమన్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత శనివారం నుంచి టి.ప్రసాద్ కూరగాయలు పంపడం లేదని, ఆయన పేరుతో ఉన్న బోర్డులను తొలగించాలని చెప్పారన్నారు. ఈ క్రమంలో అన్నప్రసాద పథకానికి కూరగాయలు అందించేందుకు బుక్కాపురం గ్రామానికి చెందిన కిషోర్, ఇండస్ ఆస్పత్రి వైద్యులు శ్రీనివాస్, తాడిపత్రికి చెందిన మల్లికార్జున, హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు దాతలు ముందుకొచ్చారని చెప్పారు. ఏఈఓ మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ తదితరులు పాల్గొన్నారు.

### వ్యాపారి అదృశ్యం

- లబోదిబోమంటున్న రైతులు

రుద్రవరం: మండలంలో మొక్కజొన్న కోనుగోలు చేసే ఓ వ్యాపారి గత కొద్ది రోజులుగా అదృశ్యమయ్యాడు. దీంతో ఆయనకు దిగుబడులు విక్రయించిన రుద్రవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు లబోదిబోమంటున్నారు. వివరాలు.. కొరటమద్ది గ్రామానికి చెందిన వ్యాపారి గత కొన్నేళ్లగా రుద్రవరంలో ఉంటూ రైతుల నుంచి మొక్కజొన్న దిగుబడులు కొనుగోలు చేసి చెప్పిన గడువుకు అటూఇటుగా సొమ్ము చెల్లించేవాడు. అతనిపై నమ్మకం కలగడంతో రైతులు ఈ ఏడాది దాదాపు 81 లారీల మొక్కజొన్న దిగుబడులను వాయిదా పద్ధతిలో సొమ్ము ఇచ్చే ఒప్పందంతో విక్రయించారు. కొంత మందికి ఫోన్‌పే ద్వారా కొంత సొమ్ము చెల్లించాడు. ఈ క్రమంలో గత కొద్ది రోజుల నుంచి వ్యాపారి అదృశ్యమయ్యాడు. అతని నుంచి నా లుగైదు కోట్ల రూపాయలు రావాల్సి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బాధిత రైతులందరూ గురువారం జిల్లా ఎస్పీని కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయించగా సొమ్ము చేతికి రాకపోతే రోడ్డున పడాల్సి వస్తుందని మొరపెట్టుకున్నారు.

### మూడు నెలల పింఛన్ ఒకేసారి పొందొచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): సామాజిక పింఛన్ సొమ్మును ఏ కారణంచేత అయినా పొందలేకపోతే మరుసటి నెల బకాయితో కలిపి పొందొచ్చు. ఇలా మూడు నెలల పింఛన్ సొమ్మును ఒకేసారి పొందొచ్చు. అలాగే పింఛన్ పొందుతున్న పురుషుడు మరణిస్తే అతని భార్యకు మరుసటి నెల నుంచి వితంతు పింఛన్ మంజూరు చేస్తారు. ఈ మేరకు సెర్ప్ సీఈఓ వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు.

### కర్నూలు వ్యవసాయ మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

| పంట | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| వేరుశెనగ | 4,099 | 6,260 |
| పొద్దుతిరుగుడు | 5,869 | 5,969 |
| ఆముదం | 5,190 | 5,715 |
| వాము | 14,509 | 15,918 |
| ఉల్లి | 495 | 5,099 |
| ఎండుమిర్చి | 713 | 15,613 |
| శనగలు | 6,119 | 6,119 |
| కందులు | 8,196 | 8,196 |
| మొక్కజొన్న | 1,509 | 2,261 |
| మినుములు | 4,007 | 8,196 |
| కొర్రలు | 1,879 | 2,911 |
| సోయాచిక్కుడు | 2,891 | 3,191 |
| సజ్జలు | 2,180 | 2,180 |

ఫోన్ నం : 08518–257204, 257661

# కేరింత.. తుళ్లింత


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ఎన్‌టీకే నాయక్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కలర్‌ఫుల్‌గా మారింది. పీజీ విద్యార్థులు కేరింతలు కొండుతూ హుషారుగా గడిపారు. మాస్ దంచుడు.. క్లాస్ స్టెప్పులతో అదరగొట్టారు. డిపార్ట్‌మెంట్ల వారీగా కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటూ జోష్ నింపారు. వర్సిటీలో శుక్రవారం పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను సీనియర్స్ ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సందేశమిచ్చారు. క్రమశిక్షణతో మెలుగుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, వర్సిటీ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఆచార్య ఎస్.నరసింహులు, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య భరత్‌కుమార్ మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు జోష్ నింపాయి. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నాగరాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

### చోరీ కేసు నిందితుల అరెస్ట్

కర్నూలు న్యూసిటీ: టూటౌన్ పరిధిలో చోటు చేసుకున్న రెండు దొంగతనాలను పోలీసులు ఛేదించారు. చందన బ్రదర్స్ షోరూంలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రూ.2 లక్షలు రికవరీ చేశారు. అదేవిధంగా బజాజ్ షోరూంలో దొంగతనానికి పాల్పడిన హరికృష్ణ, మునిస్వామిలను పోలీసులు అరెస్టు చేశారు. వారి రివురు రూ.2.36 కోట్లు చోరీ చేయగా రూ.43 లక్షలు రికవరీ చేశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజరావు మాట్లాడతూ.. నిందితులపై కేసులు నమోదు చేసి రికవరీ సొమ్ముతో సహా కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు.

# క్లస్టర్ వర్సిటీలో నేడు యువతరంగ్


మాట్లాడుతున్న వీసీ డీవీఆర్ సాయిగోపాల్

కర్నూలు (సిటీ): క్లస్టర్ వర్సిటీలో శనివారం యువతరం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. శుక్రవారం వర్సిటీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే మొదటి ఏకైక క్లస్టర్ యూనివర్సిటీ కర్నూలులోనే ఏర్పాటైందన్నారు. వర్సిటీ పరిధిలో ఉన్న సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజ్, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలల్లోని పీజీ కోర్సులను 2024–25 విద్యా ఏడాది నుంచి వర్సిటీ క్యాంపస్ నుంచి తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కొత్తగా ఏడు కోర్సులను ప్రారంభించనున్నామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం క్లస్టర్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. ఆర్థిక శాఖ నుంచి ఆమోదం వచ్చిన వెంటనే భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. యువ తరంగ్ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్‌తోపాటు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ హాజరవుతారన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పార్వతి, వింధ్య వాసిని పాల్గొన్నారు.

### నేడు బీసీ శంఖారావం

కర్నూలు (అర్బన్): బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నగరంలోని నందికొట్కూరు రోడ్డు ఆదర్శ విద్యామందిర్ ప్రాంగణంలో బీసీ శంఖారావం సభను నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్య క్ష, కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, టి.మద్దిలేటి తెలిపారు. సభ ప్రాంగణాన్ని శుక్రవారం సాయంత్రం బీసీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 77 సంవత్సరాల స్వతంత్ర్య భారత దేశంలో బీసీల జీవితాలు అంధకారంలోనే మగ్గుతున్నాయన్నారు.ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీలను జెండాలు మోసేందుకే వాడుకుంటున్నారని, అజెండా అడిగితే దూరం పెడుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలో బీసీ కులాలను ఐక్యం చేసి హక్కుల కోసం పోరాటం నిర్వహిస్తామన్నారు. బీసీ శంఖారా వం సభకు సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితతో పాటు పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు.సభలో భాగంగా బీసీ కులాల కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# ఉపాధి నిధులతో పశుగ్రాసం సాగు

- 100 శాతం సబ్సిడీతో 10 – 50 సెంట్లలో సాగుకు అవకాశం
- జాబ్ కార్డు ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులు
- 1000 ఎకరాల్లో సాగు లక్ష్యం


సూపర్ నేపియర్ పశుగ్రాసం సాగును పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 100 శాతం సబ్సిడీతో బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్గదర్శకాల ప్రకారం జాబ్ కార్డు కలిగి ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతో పాటు సన్న, చిన్నకారు రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగుకు అర్హులు. జిల్లాలో 1000 ఎకరాల వరకు పశుగ్రాసాల సాగుకు అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. 10 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసేందుకు మొత్తం ఖర్చు రూ.6,599 అవుతుంది. ఇందులో లేబర్ కాంపోనెంటు కింద రూ.3 వేలు, మెటీరియల్ కాంపోనెంటు (విత్తనం ధర, ఇతర ఖర్చులు) కింద రూ.3,599 చెల్లిస్తారు. 20 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.6 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.7,197 (మొత్తం రూ.13,197), 30 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.9 వేలు, మెటీరియల్ ఖర్చు 10,795 (మొత్తం రూ.19,795), 40 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.12 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.14,394 (మొత్తం రూ.26,394), 50 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్ ఖర్చు రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17,992 (మొత్తం రూ.32,992) ఉపాధి నిధుల నుంచి చెల్లిస్తారు. దరఖాస్తుతో పాటు జాబ్‌కార్డు, భూమి 1బీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాసు పుస్తకం, రేషన్‌కార్డు నకళ్లు సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత పశు వైద్యులను సంప్రదించాలని కోరారు.

**సూపర్ నేపియర్ రకం సాగుకు అనుకూలం**

బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సూపర్ నేపియర్ రకం ఉమ్మడి కర్నూలు జిల్లాకు అనుకూలమని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. బహువార్షిక రకాల్లో ఇది ముఖ్యమైనది. ఈ పశుగ్రాసం అన్ని రకాల నేలల్లో పెరుగుతుంది. సారవంతమైన నేలలో అధిక దిగుబడి ఇస్తుంది. సూపర్ నేపియర్ రకాన్ని అన్ని కాలాల్లోను నాటుకోవచ్చు. 50 సెంట్ల భూమిలో ఏడాదికి 100 టన్నుల వరకు పశుగ్రాసం దిగుబడి వస్తుంది. సూపర్ నేపియర్ రకం సాగు జిల్లాకు అనుకూలమని పశుసంవర్ధక శాఖ అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ నాగరాజు తెలిపారు. బహుళ వార్షిక పశుగ్రాసాలు ఒక్కసారి సాగు చేసుకుంటే కొన్నేళ్ల పాటు దిగుబడి వస్తుంది. అయితే నీటి సదుపాయం ఉండాలని పేర్కొన్నారు.


సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ ఫ్యూచర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారి న్యూ వెంచర్ అక్షయ డ్రీమ్ వ్యాలీ హుస్సేనాపురం ఊరు ఆనుకొని వివిధ వెంచర్ల మధ్యన తక్షణం ఇల్లు కట్టుకొనే అవకాశం కలదు. తక్కువ ధరకు ప్లాట్లు అమ్మబడును. సంప్ర: 6300265849. [L-783285]

WANTED

■ మా రియల్ ఎస్టేట్ సంస్థ కర్నూలు యందు Digital Marketing రంగంలో పనిచేయుటకు అనుభవజ్ఞులైన వ్యక్తులు కావలెను. Kurnool. Exp: 0-10yrs. Cell: 9676446696, 9000737431. [L-548]

■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 29స్త్రీ/పులు కావలెను. జీ:14వేలు+DA6వేలు+బోనస్ +ఫ్రీ రూం+భోజనం. అ:7th-డిగ్రీ, ITI, డిప్లొమా (P/F) కల్లూరు రోడ్, కర్నూలు. ✆ 80748 16824 [L-783282]

■ నంద్యాల జిల్లాలోని ప్రసిద్ధ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు ఎంప్లాయిస్, టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Fixed Salary: 10 to 15,000, Food+Accomidation +Incentives. CONT: 9640599980. [L-783284]

■ శ్రీశైలంలో గల ప్రముఖ రెస్టారెంట్ నందు పనిచేయుటకు సెక్యూరిటి గార్డులు(M) మరియు స్టాల్ సూపర్‌వైజర్స్ (M/F) కావలెను. అర్హత: 10 నుండి డిగ్రీ, జీతం: 13వేలు నుండి 14వేలు, రూమ్+భోజనం కలదు. సంప్ర: 9581776923/25. [L-1262598]

■ Paytm నందు పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (ఆన్ రోల్) కావలెను. అర్హత: 10th, స్మార్ట్ ఫోన్ & బైక్ తప్పనిసరి. సంప్ర: కర్నూలు-9848555198, 9849008397. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం-9000551399, నంద్యాల-7013293680 [L-794852]

■ Wanted Experienced Telugu, Hindi, Biology, Computer, PET. for Higher Classes & Teachers for Nursery to V Classes. Attend Interview daily Between 10am to 12pm. K.V.R High School. KVR Gardens, Opp: Vaddegeri, KNL. Cell: 8639708339, 7702362798. [L-546]

■ Wanted Video Editor (Male/Female) Sal:15K to 20K with food & Accom. St.Antony's high school. Porumamilla, Kadapa (Dt). Con: 8822269999 [C-1249235]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, చంటి పిల్లలను, చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి, ఫుడ్, జీ : 18K. Ph: 8520980099, 8520874499 [SCA24000673]

■ కష్టలైన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995984445 [HA-99066]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09165
70750 09185